క్లుప్తంగా

రైలు బోగీలను పరిశుభ్రంగా ఉంచాలి



సామర్లకోటలో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న స్టేషన్ మేనేజర్ తదితరులు

సామర్లకోట: రైల్వే ప్రయాణికులు ప్రయాణం చేసే బోగీలను పరిశుభ్రంగా ఉంచాలని సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏసీ, సాధారణ బోగీలను శుభ్రం చేశారు. సామర్లకోట స్టేషన్‌కు వచ్చిన 18463 ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలను, మరుగుదొడ్లను శుభ్రం చేసి, స్వచ్ఛ భారత్ ప్రాధాన్యాన్ని వివరిస్తూ, కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంపై రైల్వే ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు నేడు సత్కారం

సామర్లకోట: టీచర్స్ డే సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న వారిని మంగళవారం సాయంత్రం సత్కరించనున్నట్టు ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప హాజరై, అవార్డు గ్రహీతలను సత్కరిస్తారని చెప్పారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలన్నారు.

పి.వేమవరంలో నేడు ప్రజా వేదిక

సామర్లకోట: మండలంలోని పి.వేమవరం గ్రామంలో మంగళవారం ఉదయం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజావేదిక నిర్వహిస్తారని ఎంపీడీఓ డి.శ్రీలలిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



ఎంపీ తంగెళ్లకు డీడీని అందిస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి: విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్థానిక వీవీఎస్ పాఠశాల విద్యార్థులు ఇటీవల విరాళాలు సేకరించారు. సేకరించిన రూ.లక్ష విరాళాలను డీడీల రూపంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మకు సోమవారం అందించారు. విరాళాలు సేకరించిన విద్యార్థులను వారు అభినందించారు.


వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న సిద్దా మురళి

పిఠాపురం: లాతూర్ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో గొల్లప్రోలు కరణం గారి తోటలో వరద బాధితులకు సోమవారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. గొల్లప్రోలుకు చెందిన డాక్టర్ సిద్దా కోటేశ్వరరావు కుమారుడు సిద్దా మురళి చేతుల మీదుగా నిరు పేదలైన వృద్ధులకు, మహిళలకు, పట్టణ పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరకుల ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి కరణం గారి తోటకు చెందిన యువకులు సహకరించారు.

దోమల మందు పిచికారీ



వసతి గృహంలో దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో డెంగీ కేసు నమోదు కావడంతో వైద్య సిబ్బంది సోమవారం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఎక్కువగా విద్యార్థులు ఉండే వసతి గృహాల్లో దోమల నివారణ మందులు పిచికారీ చేశారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు బాలికల హాస్టల్, గవర్నమెంట్ బీసీ బాలుర హాస్టల్, ఈబీసీ కాలనీ బాలికల హాస్టల్, ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్లో దోమల మందు పిచికారి చేశారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే డెంగీ, మలేరియా లాంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు కాకినాడ సబ్ యూనిట్ ఆఫీసర్ దానియేలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యారోగ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రై వాష్.. వ్యాధులు స్మాష్

- రోగాల వ్యాప్తికి ఆదిలోనే అడ్డుకట్ట
- అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది
- గ్రామాల్లో విస్తృతంగా ప్రత్యేక కార్యక్రమాలు



గొల్లప్రోలు మండలం చిన జగ్గంపేటలో ఇళ్ల మధ్య ఉన్న నీటి గుంట వద్ద జాగ్రత్తలు వివరిస్తున్న వైద్య సిబ్బంది



గొల్లప్రోలు మండలంలో ఇళ్ల వద్ద దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు చెబుతున్న వైద్య సిబ్బంది

పిఠాపురం: ఒకవైపు మండిపోతున్న ఎండలు.. మరోవైపు ఎడాపెడా వర్షాలు.. వెరసి విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు, అంటు రోగాలపై జనం బెంబేలెత్తుతున్నారు. వ్యాధులు వచ్చాక వైద్యం చేయడం కంటే, ముందుగానే వ్యాధులు రాకుండా అడ్డుకట్ట వేయాలని వైద్యారోగ్య శాఖాధికారుల ఆదేశాలివ్వడంతో, వైద్య సిబ్బంది డ్రై వాష్ పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వ్యాధులు ఎక్కడ, ఎలా విజృంభించే అవకాశాలున్నాయి, వాటిని ఎలా నివారించాలనే విషయంపై దృష్టి సారించారు. ముఖ్యంగా క్రిమికీటకాదులు పెరిగి వ్యాధులకు కారణమయ్యే అవకాశాలను గుర్తించి, వాటిని ఆదిలోనే నిర్మూలించే విధంగా చర్యలు చేపట్టారు.

ఫ్రైడే.. డ్రైడే

శుక్రవారం నాడు డ్రై డేగా ప్రకటించిన వైద్య ఆరోగ్య శాఖాధికారులు గ్రామాల బాట పట్టి గ్రామాల్లో బృందాలుగా పర్యటిస్తున్నారు. అన్ని గృహాలు సందర్శించి, ఇళ్ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు. ఇళ్ల వద్ద దోమలు నిల్వ ఉండే పరిసరాలు, గోతులు, ఖాళీ డబ్బాలు, డ్రైన్లు వంటి వాటిని పరిశీలించి, దోమలు వ్యాప్తి చెందకుండా మందులు పిచికారీ చేయిస్తున్నారు. ముఖ్యంగా బురద, నీరు నిల్వ ఉండకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో అన్ని మురికి కాలువల్లోను దోమల నివారణకు మందులు పిచికారీ చేస్తున్నారు. ఫీవర్ సర్వే చేసి ఇళ్లల్లో కుటుంబ సభ్యులు అందరినీ పరిశీలించి, వ్యాధులు సోకిన వారికి తక్షణ వైద్య సదుపాయం కల్పిస్తున్నారు.

వాష్‌లో తీసుకునే చర్యలివే..

నీరు, గాలి, ఈగలు, మట్టి, మలినాలు, అపరిశుభ్ర వాతావరణం, చేతులు శుభ్రం చేయకపోవడం వంటి వాటివల్ల వ్యాధులు విజృంభించే అవకాశాలున్న విషయాన్ని వివరించడమే వాష్ కార్యక్రమం ముఖ్యోద్దేశం.
గ్రామాల్లో ఫీవర్ సర్వే చేయడం, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు కలగజేసే దోమల నివారణకు చర్యలు తీసుకోవడం, శానిటేషన్, తాగునీరు, శుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం. అంటు రోగాలకు కారణమయ్యే కుళ్లిన, నిల్వ ఉన్న ఆహారాలు తినకుండా ప్రజలను అప్రమత్తం చేయడం. చేతులను శుభ్రం చేసుకునే విధానాలను వివరించడం వంటి చర్యలు తీసుకుంటారు. గ్రామాల్లో ఇళ్లకు వెళ్లి దోమలు గుడ్లు పెట్టే అవకాశాలున్న పరిసరాలను గుర్తించి, దోమలు ఉత్పత్తి కాకుండా తీసుకోవాల్సిన చర్యలు ప్రజలకు వివరించడం. దోమలను గుడ్లు దశలోనే నివారించడానికి ప్రతి ఇంటి వద్ద ప్రత్యేక చర్యలు తీసుకోవడం. ప్రజలకు సూచనలు ఇవ్వడంతో పాటు, ఎవరైనా వ్యాధుల బారిన పడితే, వారిని వెంటనే ఆస్పత్రికి తరలించి తక్షణ చికిత్స అందించడం వంటి చర్యలను వేగవంతంగా తీసుకుంటారు.

ముందు జాగ్రత్తలు పాటించాలి

"గొల్లప్రోలు మండలంలో గ్రామాల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా వ్యాధులను కట్టడి చేయగలుగుతున్నాం. ఎక్కడ దోమలు వ్యాప్తి చెందుతాయో గుర్తించి, వాటి నివారణకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాం. ఆశా కార్యకర్తలు తమ పరిధిలో ప్రతి రోజు 30 కుటుంబాలను సందర్శించి, ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకున్నాం. మలేరియా, చికున్ గున్యా, మెదడువాపు, స్వైన్‌ఫ్లూ, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు, నీళ్ల విరేచనాలు, కలరా, పచ్చ కామెర్లు వంటి వ్యాధులు ఎలా వ్యాప్తి చెందుతాయో ప్రజలకు వివరిస్తున్నాం. ముఖ్యంగా రోడ్డు పక్కన అమ్మే పానీపూరీ, కుళ్లిన చేపలు, నిల్వ ఉన్న మాంసాహారం, కుళ్లిన పండ్లు వంటి వాటిని తిన్నా, ఇళ్ల వద్ద పారేసినా ఈగలు, దోమలు వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్న విషయాన్ని ప్రజలకు వివరిస్తున్నాం."

– అహ్మద్ బాషా, హెల్త్ సూపర్‌వైజర్, గొల్లప్రోలు

క్రీడా పోటీలకు మేడపాడు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో హెచ్ఎం, పీడీలు

సామర్లకోట: నియోజకవర్గ స్థాయిలో జరిగే క్రీడా పోటీలకు జి.మేడపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ యార్లగడ్డ బంగార్రాజు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, 14 ఏళ్ల విభాగం బాలుర వాలీబాల్‌లో వినయ్‌కుమార్, మనోజ్, సీనియర్స్‌లో వినయ్, విశ్వం, కబడ్డీ జూనియర్ విభాగంలో చక్రధర్, చెస్ సీనియర్స్‌లో గణేష్ ఎంపికైనట్టు వివరించారు. అదేవిధంగా బాలికల్లో సీనియర్ కబడ్డీకి సురేఖ, ఫాతిమా, మౌని, వాలీబాల్ సీనియర్స్‌లో శ్రీదేవి, వాలీబాల్ జూనియర్స్‌లో అస్మిత, శ్రీదేవి ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులను హెచ్ఎం పాండవులు, గ్రామ పెద్దలు అభినందించారు.

కొనసాగుతున్న గణేశ్ నిమజ్జనాలు



నిమజ్జనం కోసం గణేశ్ విగ్రహానికి నిర్వహిస్తున్న ఊరేగింపు

సామర్లకోట: పట్టణంలో గణేశ్ నిమజ్జనాలు సోమవారం కొనసాగాయి. రాత్రి విద్యుద్దీపాల అలంకరణ, డీజే సౌండ్‌లతో ఊరేగింపు నిర్వహించి, నిమజ్జనాలు నిర్వహించారు. ఈ నెల ఏడో తేదీన ప్రారంభించిన నవరాత్రి ఉత్సవాల నిమజ్జనాలకు ఏర్పాటు చేసిన క్రేన్‌ను నిమజ్జన ప్రదేశం నుంచి తొలగించారు. దాంతో ఊరేగింపుగా గోదావరి కాలువ వద్దకు వచ్చిన విగ్రహాలను, వంతెన నుంచి గోదావరి కాలువలో వేసే విధంగా పోలీసులు చర్యలు తీసుకున్నారు. నిమజ్జనాలు రాత్రి సమయంలో జరగడంతో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. నిమజ్జనాలకు గడువు తేదీని నిర్ణయించి, పూర్వయ్యే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

వాకతిప్పలో అన్న సమారాధన

కొత్తపల్లి: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని మండలంలోని వాకతిప్పలో సోమవారం భారీ అన్న సమారాధనలు నిర్వహించారు. వాకతిప్ప కాపుల రామాలయం వీధిలో ఉన్న గణపతి మందిరం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన జరిగింది. వాకతిప్ప గ్రామం నుంచే కాకుండా, కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, ఉప్పాడ తదితర గ్రామాల నుంచి సుమారు 3 వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

కరాటేలో 'కోట' విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన విజేతలతో కోచ్ శంకర్

సామర్లకోట: చైన్నెలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సామర్లకోటకు చెందిన విద్యార్థులు మంచి ప్రతిభను కనబర్చి నాలుగు బహుమతులు సాధించారు. ఈ వివరాలను కరాటే కోచ్ డి.శంకర్ సోమవారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సామర్లకోటకు చెందిన విద్యార్థులు సబ్ జూనియర్స్ విభాగంలో బహుమతులు సాధించారు. బాలికల విభాగంలో ఎం ప్రణీత, డి.వర్షిత పద్మావతి సిల్వర్ మెడల్లు పొందారు. బాలుర విభాగంలో ఎస్ సాయి తేజేష్, వి.కుశ్వంత్ బ్రాంజ్ మెడల్లు సాధించారు. అత్యంత క్లిష్టమైన పోటీల్లో సామర్లకోటకు చెందిన విద్యార్థులు నాలుగు బహుమతులు సాధించడం తమకెంతో ఆనందంగా ఉందని కోచ్ శంకర్ తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్, జిల్లా చైర్మన్ చిత్తూలూరి వీర్రాజు, మేకా శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

అర్జీల సత్వర పరిష్కారానికి గ్రీవెన్స్



అర్జీ స్వీకరిస్తున్న ఏఓ మాధవరావు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆర్డీఓ కార్యాలయ ఏఓ కేవీ మాధవరావు అన్నారు. ప్రతి వారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి పది అర్జీలు అందినట్టు చెప్పారు. అనంతరం ఏఓ మాధవరావు విలేకర్లతో మాట్లాడుతూ, డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి, సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఇందుకు డివిజన్ స్థాయిలో అన్ని శాఖల అధికారులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. గ్రీవెన్స్‌కు వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధికారిపై ఉందన్నారు. ఈ వారం అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, హౌసింగ్ అధికారి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామివారు

సామర్లకోట: స్వామి వారికి ప్రీతైన రోజు కావడంతో సోమవారం స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. స్వామి వారికి తొలి అభిషేకం, తొలి పూజలను తిలకించడానికి బారులు తీరారు. పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో అర్చకులు పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు ధ్వజ స్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలతోను, ఆలయ కోనేరులోని నీటితో అభిషేకాలు చేసుకున్నారు. స్వామి,వారిని అమ్మవార్లను దర్శించుకున్న భక్తులకు ఈఓ భళ్ల నీలకంఠం అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, అల్లకి రాజగోపాల్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు.

కుంభవృష్టితో చెరువులైన రోడ్లు



చెరువుగా మారిన సామర్లకోట పోలీస్ రింగ్ సెంటర్



సామర్లకోట మఠం సెంటర్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

సామర్లకోట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా సోమవారం సుమారు అరగంట పాటు కుంభవృష్టి వర్షం కురిసింది. దాంతో పట్టణంలోని అనేక రోడ్లు చెరువులుగా మారిపోయాయి. స్థానిక స్టేషన్ సెంటర్‌లోని రింగ్ రోడ్డు, రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్, రథం సెంటర్, మఠం సెంటర్, సంపెంగ తోట, భాస్కర్‌నగర్, సాయినగర్, సీతారామ కాలనీల్లోని రోడ్లు చెరువులను తలపించాయి. డ్రైన్లపై శ్లాబ్‌లతో మూసివేయడం, డ్రైన్లను ఆక్రమించడం వలన వర్షపు నీరు పోయే మార్గం లేక, రోడ్లన్నీ జలమయం అయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో డ్రైన్లు పొంగి ప్రవహించాయి. బస్సు కాంప్లెక్స్ చెరువుగా మారడంతో, బస్సులు ఎక్కే, దిగే ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.

శ్మశాన వాటికను బాగు చేయండి

జీవన్ అరుంధతీయ సంక్షేమ సంఘం వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జీవన్ అరుంధతీయ సంక్షేమ సంఘ నాయకులు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ అరుందతీయపేట శ్మశాన వాటిక ఆక్రమణలకు గురి కావడంతో తీవ్ర ఇబ్బందులకు పడుతున్నామని జీవన్ అరుంధతీయ సంక్షేమ సంఘ ప్రతినిధులు కోరారు. వెంటనే దానిని బాగు చేయించాలంటూ సోమవారం వారు నగర పంచాయతీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. గొల్లప్రోలు నగర పంచాయతీ అరుంధతీయపేట శ్మశాన వాటిక స్థలంలో నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు చెత్తను వేస్తున్నారని వారు ఆరోపించారు. వర్షాలు, వరదలు వస్తే శ్మశాన వాటిక నీట మునుగుతుందని, ఎవరైనా చనిపోతే చనిపోయినందుకు ఏడవాలో లేక పూడ్చడానికి వీల్లేక రోదించాలో తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు తగిన చర్యలు తీసుకుని శ్మశానాన్ని బాగు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జీవన్ అరుంధతీయ సంక్షేమ సంఘం నాయకులు నేకూరి ప్రసాద్, ముప్పిడి సత్తిరాజు, మసిరపు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అందరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి



మర్లావలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ రాజా

పెద్దాపురం: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని పెద్దాపురం వైస్ ఎంపీపీ మిరియాల రాజా అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా మర్లావ గ్రామంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం ఆయన గ్రామ నాయకులు గవరసాని దివాకర్, కామన రామకృష్ణ, కాతా శంకరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రాజా మాట్లాడుతూ. ప్రతి ఏటా గణపతి నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. దివంగత మాజీ వైస్ ఎంపీపీ పద్మరాజు ఆశయ సాధనలో భాగంగా ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అన్న సంతర్పణలో వడ్డన చేసి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మర్లావ, కాండ్రకోట, ఉలిమేశ్వరం, తూర్పుపాకల, సిరివాడ, గుడివాడ, కిర్లంపూడి మండలం రామచంద్రపురం, తామరాడ, పాలెం తదితర గ్రామాల నుంచి వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలో భావనారాయణ స్వామి ఆలయం సమీపంలో అదే గ్రామానికి చెందిన మెకానిక్ దేవబత్తుల కిరణ్‌బాబు(31) మృతదేహం సోమవారం లభ్యమైంది. అతడు అదృశ్యమైనట్టు నాలుగు రోజుల క్రితం సర్పవరం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అజయ్‌బాబు తెలిపారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే సహించం

ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల



పులిమేరులో ఆందోళన చేస్తున్న రైతు కూలీలు

పెద్దాపురం: ప్రతిష్టాత్మకమైన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తే సహించేది లేదని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు హెచ్చరించారు. మండలంలోని పులిమేరు గ్రామంలో సోమవారం ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ, ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయడం ఆపాలని, విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోందని మండిపడ్డారు. దీనిపై ప్రజా సంఘాలు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్పొరేట్ వ్యవస్థకు విశాఖ ఉక్కును కట్టబెట్టే ప్రయత్నం మానుకోవాలని, లేకుంటే మోదీ ప్రభుత్వంపై మరింత తీవ్ర స్థాయిలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, పులిమేరు రైతు కూలీ సంఘం నాయకులు భూషణం, నారాయణ, నాగేశ్వరరావు, అన్నవరం, మహాలక్ష్మి పాల్గొన్నారు.

టీటీ జాతీయ పోటీలకు ఎంపిక

పెద్దాపురం: మూడు రోజుల పాటు స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలల్లో నిర్వహించిన సీబీఎస్ఈ క్లస్టర్ స్థాయి ఏడో టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఆ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్టు పాఠశాల డైరెక్టర్ సీహెచ్.విజయ్‌ప్రకాష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–14 బాలికల్లో నయన కొల్లి (కెప్టెన్), గీతాంజలి భైరవ కాంస్య బహుమతిని గెల్చుకున్నారు. బాలుర విభాగంలో టి.సాయిశర్వణ్(కెప్టెన్), ఎ.సృజన్, వేద్ తివారి, అభిక్ భట్టాచార్య.అండర్–17 బాలికల విభాగంలో ఎం.శాంతిజ్యోతి (కెప్టెన్), మౌపర్ణదాస్, సీహెచ్.సాయిశృతి, డి.నిషితసాయి, బాలురులో డి.ప్రహర్ష (కెప్టెన్), కె.వెంకయ్యనాయుడు, కె,గిరీష్, ఆయుష్మాన్ కాంస్య బహుమతులు సాధించారు. అండర్–19 బాలికల్లో టి.సాయి సుదీక్ష (కెప్టెన్), ఎం.దర్శిక, ధరణి శ్రీకార్తికేయ, జాయ్ రెజీనా, బాలురులో పి.అశ్విన్ (కెప్టెన్), సీహెచ్.విజయధర్, టీఎస్ఎస్ విఖ్యాత్, ఎస్.వెంకటధనుష్ స్వర్ణ బహుమతులు గెలుచుకున్నారు. అక్టోబర్‌లో హిమాచల్ ప్రదేశ్‌లో జరిగే జాతీయ పోటీలకు అర్హత సాధించారు.

సినిమాలు



సామర్లకోట	
అనుశ్రీ 1	: భలే ఉన్నాడే
అనుశ్రీ 2	: సరిపోదా శనివారం
విఘ్నేశ్వరా	: మత్తు వదలరా 2
పెద్దాపురం	
లలిత 1	: 35
లలిత 2	: గొర్రె పురాణం ఉత్సవం
వీరభద్ర	: మత్తు వదలరా 2
శోభా	: మిస్టర్ బచ్చన్
పిఠాపురం	
అన్నపూర్ణ	: సరిపోదా శనివారం
పూర్ణ	: టూ షోస్ చెక్ లేట్
పూర్ణ 2	: షూస్ హైడెన్సిక్
శ్రీసత్య	: గొర్రె పురాణం
శ్రీవెంకటేశ్వర	: మత్తు వదలరా 2
ఉప్పాడ	
శ్రీనివాస	: మత్తు వదలరా 2